సాక్షి అనంతపురం

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



ప్రమాదంలో చిన్నారి మృతి

నంద్యాల జిల్లాలో కారు, బొలెరో పరస్పరం ఢీకొన్న ఘటనలో జిల్లాకు చెందిన ఓ చిన్నారి మృతి చెందింది. 8లో



పారాహుషార్!

బదిలీల పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కిన ఉపాధ్యాయులు ఆందోళనలో పడిపోయారు. అక్రమ మార్గాలు.. చివరకు వారి మెడకే చుట్టుకోబోతున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
41.2°/24.6°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు రాప్తాడులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రాప్తాడు మండలంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసన్నాయపల్లి వద్ద ఉన్న ఆర్‌జీసీ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు తమ వివరాలతో పాటు సమస్యలను అర్జీ రూపంలో అందజేయాలన్నారు. సమస్యపై గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి స్లిప్, పాత రసీదు తీసుకు రావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు సమాచారం వస్తుందని, కాబట్టి అర్జీదారులు తమ ఫోన్‌లోని మెసేజ్‌లను చూసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సాప్‌లో పంపిస్తామన్నారు. అర్జీ సమర్పించేప్పుడు కచ్చితమైన వివరాలను ఇవ్వాలని సూచించారు. రాప్తాడు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిందాల్ కార్మికుడి అనుమానాస్పద మృతి



అభిషేక్ భూయాన్ మృతదేహం

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం గ్రామ శివారులో ఉన్న జిందాల్ ఫ్యాక్టరీలో పని చేసే ఓ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. జార్ఖండ్ రాష్ట్రంలోని ఛత్రా జిల్లా ఖర్మహీ గ్రామానికి చెందిన అభిషేక్ భూయాన్ (36), తమ్ముడు గణేష్ భూయాన్‌తో కలిసి కొన్నేళ్ల క్రితం వలస వచ్చాడు. జిందాల్ ఫ్యాక్టరీలో పనికి కుదిరాడు. ఇటీవల అభిషేక్ భూయాన్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 14న జీతం తీసుకున్నప్పటి నుంచి ఇంకా ఎక్కువగా మద్యం తాగేవాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం కనపడకుండా పోయిన ఇతను.. ఆదివారం ఫ్యాక్టరీ సమీపంలోనే విగత జీవిగా పడి కనిపించాడు. ఫ్యాక్టరీ కార్మికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గణేష్ భూయాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు. మద్యం ఎక్కువగా తాగి నీటి దాహానికి మృతి చెందాడా.. లేక ఎవరైనా హతమార్చారా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

భక్తులపై తేనెటీగల దాడి

- 20 మందికి గాయాలు



తేనెటీగలు దాడి చేయడంతో కేకలు వేస్తూ రోడ్డు మీదకి వచ్చిన భక్తులు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులపై ఆదివారం తేనెటీగలు దాడి చేశాయి. వివరాలు.. మండల పరిధిలోని వెలిగొండ గ్రామానికి చెందిన రాజశేఖర్, భాగ్యమ్మ, శ్రీలేఖ, రామాంజినేయులు, జయలక్ష్మి, రాజేశ్వరి, యుగంధర్, మల్లికార్జున, ప్రతాప్, ప్రభాస్, జనార్దన్ తదితర 20 మంది ఆదివారం పెన్నహోబిలం వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పొట్టేలు బలి ఇచ్చి ఆలయం కింది భాగంలో వంట చేసుకుని విందు భోజనాలకు కూర్చున్నారు. ఈ క్రమంలోనే అక్కడే చెట్టు మీద ఉన్న పెద్ద తేనెతుట్టె నుంచి ఒక్కసారిగా తేనెటీగలు లేచి దాడి చేశాయి. హఠాత్పరిణామంతో ఆందోళనకు గురైన వారు కేకలు వేస్తూ పిల్లాపాపలతో కలిసి పరుగు తీశారు. స్థానికులు 108 సాయంతో గాయపడ్డ వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ





డీఎస్సీ కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు (ఫైల్)

- డీఎస్సీలో ఉమ్మడి జిల్లాకు 202 ఎస్జీటీ పోస్టులు
- 24 వేల మందికి పైగా అభ్యర్థులు.. ఒక్కో పోస్టుకు 120 మందికి పైగా పోటీ!
- ఉమ్మడి జిల్లా స్థాయిలో మొత్తం 811 పోస్టులకు నోటిఫికేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో టీచర్ పోస్టుల భర్తీకి ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, జోన్, రాష్ట్రస్థాయి పోస్టులు 16,347 భర్తీ చేయనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు వివిధ కేటగిరీ పోస్టులు నామమాత్రంగా కేటాయించారు. మరీ ముఖ్యంగా ఎస్జీటీ పోస్టులు కేవలం 202 భర్తీ చేయనున్నారు. 24 వేల మందికి పైగా అభ్యర్థులుండగా, ఒక్కో పోస్టుకు 120 మందికి పైగా పోటీపడాల్సిన పరిస్థితి ఉందని అభ్యర్థులు చెబుతున్నారు.

పాత సీసాలో కొత్త సారా..

ఎస్జీటీ పోస్టుల భర్తీ 'పాత సీసాలో కొత్తసారా' అన్న చందంగా తయారైందని అభ్యర్థులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ప్రకటించిన డీఎస్సీలోనే ఉమ్మడి జిల్లాకు 183 ఎస్జీటీ పోస్టులు చూపించారు. ఇప్పుడు అదనంగా 19 పోస్టులు కలిపారంటున్నారు. నిరుద్యోగులు వేలాదిమంది ఉంటే తూతూమంత్రంగా పోస్టులు భర్తీ చేస్తున్నారంటూ అప్పట్లో విమర్శలు గుప్పించిన చంద్రబాబు.. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ పేరుతో వేలాది పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే అప్పటి ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ రద్దు చేసి.. మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేసిన ఆయన పది నెలల తర్వాత మోక్షం కల్పించారు. అయినా, పోస్టుల సంఖ్య పెంచకపోవడంపై నిరుద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు.

మొత్తం 811 పోస్టులు..

డీఎస్సీ ద్వారా జిల్లా స్థాయిలో మొత్తం 811 పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ స్కూళ్లతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ స్కూళ్లలో 202 ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ హిందీ 28, తెలుగు 37, గణితం 43, ఫిజికల్ సైన్స్ 66, బయోలాజికల్ సైన్స్ 72, ఇంగ్లిష్ 103, సోషియల్ 111, ఫిజికల్ ఎడ్యుకేషన్ 145 పోస్టులు ఉండగా, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి ఫిజికల్ సైన్స్ 1, బయోలాజికల్ సైన్స్ 1,ఎస్జీటీ రెండు పోస్టులున్నాయి. ఇవికాకుండా జోనల్, రాష్ట్రస్థాయిలో వివిధ పోస్టులున్నాయి.

దరఖాస్తులు ప్రారంభం..

జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆదివారం నుంచే దరఖాస్తు అవకాశం కల్పించారు. మే 15 వరకు గడువు ఉంటుంది. మే 30 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోచ్చు. అన్ని పరీక్షలు పూర్తయిన రెండో రోజున ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ప్రాథమిక కీ విడుదలైన తేదీ నుంచి ఏడు రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన ఏడు రోజుల తర్వాత తుది కీ విడుదల చేస్తారు. ఆ తర్వాత ఏడు రోజులకు మెరిట్ జాబితా ప్రకటిస్తారు.

కరువు జిల్లాకు మోసం



ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. ఎస్జీటీ పోస్టుల విషయంలో నిరుద్యోగులను మోసం చేశారు. ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం. రూ. లక్షలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నాం. తీరా నోటిఫికేషన్ వచ్చాక చూస్తే ఎస్జీటీ పోస్టులు నామమాత్రంగా ఉన్నాయి. జిల్లా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోస్టులు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– షేక్ ముజీబ్, హిందూపురం

ఆర్భాటం చేసి ఉసూరుమనిపించారు



ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ప్రచారార్భాటం చేసి చివరకు ఉసూరుమనిపించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారు. ఎస్జీటీ పోస్టులు చాలా తక్కువ చూపించారు. వెంటనే ఈ పోస్టులను పెంచి న్యాయం చేయాలి. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం పోరాడిన డీవైఎఫ్‌ఐ నాయకులపై అక్రమ కేసులు పెట్టారు. వీటిని ప్రభుత్వం ఎత్తివేయాలి.

– ఎక్కులూరు బాలకృష్ణ, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

వంచించడం తగదు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం చంద్రబాబు పెట్టిన తొలి సంతకం మెగా డీఎస్సీపై గంపెడాశలు పెట్టుకున్నాం. తీరా నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత చూస్తే ఎస్జీటీ పోస్టులు తక్కువ చూపారు. నిరుద్యోగ అభ్యర్థులను వంచించడం తగదు. డీఎస్సీలో భాగంగా జిల్లాకు ఒకే పరీక్ష నిర్వహించాలి.

– గట్టు వెంకటేష్, అనంతపురం

చుక్కలు.. తొలగని తిప్పలు

- మందకొడిగా ఫైళ్ల పరిష్కార ప్రక్రియ
- డీఎల్‌సీలో నాలుగైదు మించి పరిష్కారం కాని వైనం
- పెండింగ్‌లో 1,390కు పైగా ఫైళ్లు



అనంతపురం అర్బన్: రైతులకు చుక్కల భూముల తిప్పలు తొలగడం లేదు. ఫైళ్ల పరిష్కార ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ప్రతి శుక్రవారం చుక్కల భూముల ఫైళ్లను పరిష్కరిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆ సంఖ్య నాలుగైదు మించి ఉండడం లేదు. చుక్కల భూములకు సంబంధించి 1,397కు పైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అత్యధికంగా అనంతపురం రెవెన్యూ డివిజన్‌లో, అత్యల్పంగా గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో చుక్కల భూములు ఉన్నాయి. గుంతకల్లు డివిజన్‌కు సంబంధించి ఉన్న ఏడు ఫైళ్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

దబ్బులిస్తేనే సక్రమంగా..

చుక్కల భూముల ఫైళ్ల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన ఫలితం రావడం లేదు. ఇందుకు మండల, డివిజన్ స్థాయిలోని కొందరు సిబ్బంది అవినీతి అక్రమాలే కారణమనే ఆరోపణలు ఉన్నాయి. ఫైళ్లు సిద్ధం చేసే క్రమంలో కొందరు సిబ్బంది సంబంధిత రైతుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ముడుపులు ఇవ్వని రైతు ఫైలు సక్రమంగా సిద్ధం చేయకుండా తిరస్కరణకు గురయ్యేలా చేస్తున్నారనే విమర్శలున్నాయి.

చుక్కల భూమి అంటే...

నిషేధిత భూములు (22ఏ), చుక్కల భూములు (డాటెడ్ ల్యాండ్) రెండూ ఒకేరకం కాదు. వీటి మధ్య చాలా వ్యత్యాసం ఉంది.1954, జూన్ 18కి ముందు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూములు 22ఏ జాబితా కిందకు వస్తాయి. ఇక చుక్కల భూముల విషయానికి వస్తే.. ప్రభుత్వ భూమిగా చెప్పబడే భూమి వివరం ఆర్ఎస్ఆర్ (రీ సెటిల్మెంట్ రిజిస్టర్)లో చుక్కలుగా చూపించి ఉండాలి. ఆ భూమి ఎవరికీ అసైన్డ్ చేసి ఉండకూడదు. ఇలాంటి భూమిని అనుభవించేవారు దరఖాస్తు చేసుకుంటే.. డీఎల్‌సీ సమావేశంలో నిర్ణయం తీసుకుని జాబితా నుంచి తొలగిస్తారు.

ఆమోద ముద్రకు నిబంధనలిలా...

చుక్కల భూముల జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం డీఎల్‌సీ ఆమోద ముద్ర వేస్తుంది.

- సాగు చేస్తున్నట్లుగా చెప్పబడే ప్రభుత్వ భూమి వివరం ఆర్ఎస్ఆర్‌లో చుక్కలుగా ఉండాలి. ఆ భూమి ఎవరి పేరునా అసైన్డ్ చేసి ఉండకూడదు.
- డాటెడ్ ల్యాండ్ చట్టం-2017 ప్రకారం... ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న వ్యక్తి చట్టం వచ్చే నాటికి 12 ఏళ్ల ముందు ఆ భూమిపై హక్కు, అనుభవం కలిగి ఉండాలి.
- చట్టం నిబంధనల ప్రకారం సాగు చేస్తున్న వారు తహసీల్దారు వద్ద దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి ఆర్‌డీఓకు తహసీల్దారు నివేదిస్తారు. దానిని ఆర్‌డీఓ విచారణ చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు.
- ఇక్కడ జిల్లాస్థాయి కమిటీ వాటిని విచారణ చేసి నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉన్న వాటిని జాబితా నుంచి తొలగిస్తూ ఆమోద ముద్ర వేస్తుంది.

డివిజన్ల వారీగా పెండింగ్ ఫైళ్లు ఇలా..

అనంతపురం	967
కళ్యాణదుర్గం	423
గుంతకల్లు	07
మొత్తం	1,397

వేగవంతానికి చర్యలు

చుక్కల భూముల ఫైళ్లకు వేగవంతంగా పరిష్కారం చూపుతాం. డీఎల్‌సీ సమావేశానికి ఉంచే ఫైళ్ల సంఖ్య పెంచాలని తహసీల్దార్లు, ఆర్‌డీఓలను ఆదేశించాం. మండలాలవారీగా షెడ్యూల్ ఇచ్చి ప్రతి శుక్రవారం డీఎల్‌సీ సమావేశం నిర్వహిస్తూ ఫైళ్లు పరిష్కరిస్తున్నాం. ఫైళ్లు ఎలా సిద్ధం చేయాలనే దానిపై మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ సిబ్బందికి వారం క్రితం శిక్షణ ఇచ్చాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

నవ వరుడి ఆత్మహత్యాయత్నం

పామిడి: పెళ్లైన రెండు నెలలకే జీవితంపై విరక్తితో ఓ నవ వరుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడి మండలం కోనేపల్లికి చెందిన పుంజా హరీష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 21న యాడికి మండలం వెంకటాంపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చంద్ర ప్రభావతితో పెద్దల సమక్షంలో పామిడిలోని రహమత్ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి అయింది. దంపతుల మధ్య ఏమి జరిగిందో? ఏమో తెలియదు కానీ ఆదివారం హరీష్ పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతణ్ని కుటుంబసభ్యులు వెంటనే పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించినట్లు సమాచారం. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇక చాలు.. దయ చేయండి!



జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనం

- జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు కసరత్తు
- 150 మందిని వెళ్లగొట్టేందుకు చర్యలు వేగవంతం
- చిరుద్యోగుల జీవితాలను చిదిమేసేలా త్వరలో ఉత్తర్వులు
- వర్సిటీ ఏర్పడినప్పటి నుంచి ఉన్న ఉద్యోగులకూ ఉద్వాసన

అనంతపురం: ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం మాట తప్పింది. పైగా ఇప్పటివరకూ ఉన్న ఉద్యోగాలకూ శఠగోపం పెట్టేలా వ్యవహరిస్తోంది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో పనిచేస్తున్న 150 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు సర్వం సిద్ధం చేయడమే ఇందుకు నిదర్శనం. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 2008లో జేఎన్‌టీయూ(ఏ) ఏర్పాటైంది. వర్సిటీలో కార్యకలాపాల నిర్వహణకు అప్పట్లోనే అవుట్‌సోర్సింగ్ కింద ఉద్యోగులను నియమించారు. ప్రస్తుతం వర్సిటీ పరిధిలో మొత్తం 650 మంది ఉన్నారు. కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో 120 మంది, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల 150, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల 80, ఓటీఆర్ఐ 26, జేఎన్‌టీయూ (అనంతపురం నగరంలో)లో 274 మంది పనిచేస్తున్నారు.

అంతలోనే ఎంత తేడా..

చిరుద్యోగులకు దన్నుగా నిలిచేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 'ఆప్కాస్'ను ఏర్పాటు చేసి ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతం చెల్లించింది. ఉద్యోగాలను ఇష్టానుసారం తొలగించే పరిస్థితి లేకుండా భద్రత కల్పించింది. పీఎఫ్ సౌకర్యం ఉండేది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. 'ఆప్కాస్' నుంచి జీతాలు చెల్లించలేమంటూ చేతులెత్తేసింది. దీంతో జేఎన్‌టీయూ అంతర్గత వనరుల నుంచి జీతాలు ఇవ్వాల్సి రావడంతో ఆ మేరకు ఆర్థిక వనరులు లేక ఉద్యోగులను తొలగించాలనే నిర్ణయానికి ఉన్నతాధికారులు వచ్చారు. మూడు రోజుల క్రితం జరిగిన పాలకమండలి సమావేశంలో దాదాపు 150 మంది ఉద్యోగులను తొలగించాలని తీర్మానించినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో ఉద్యోగుల్లో భయాందోళన నెలకొంది. ఎవరిని ఇంటికి పంపుతారో.. ఎవరిని ఉంచుతారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు.గత ప్రభుత్వ హయాంలో జేఎన్‌టీయూ(ఏ)లో ఇద్దరు, కలికిరిలో ఐదుగురిని మాత్రమే ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. మిగిలిన 643 మంది చాలా ఏళ్ల నుంచి కొనసాగుతున్న వారే. ఈ క్రమంలో వర్సిటీ ఏర్పడినప్పటి నుంచి ఉన్న ఉద్యోగులకూ ఉద్వాసన తప్పదని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వస్తే జీతాలు పెరుగుతాయని ఆశించామని, కానీ ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెడతారని కలలో కూడా ఊహించలేదంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

2008 నుంచి పనిచేస్తున్న వారికి జేఎన్‌టీయూ (ఏ) యాజమాన్యం వెన్నుదన్నుగా నిలవాలి. ఉద్యోగులను తొలగించే ప్రక్రియ మానుకోవాలి. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థలో దళారుల ప్రమేయం అధికంగా ఉండేది. సక్రమంగా జీతాలు చెల్లించేవారు కాదు. 'ఆప్కాస్' ద్వారా సక్రమంగా జీతాలు అందేవి.ఇటీవల 'ఆప్కాస్' నుంచి వేతనాలు చెల్లించలేమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న ఉద్యోగులను తొలగించేలా నిర్ణయం తీసుకోవడం మంచిది కాదు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– కే.విజయ్, ఉమ్మడి జిల్లా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్

వైభవంగా కొల్హాపురి మహాలక్ష్మి ఉత్సవాలు



మహాకాళి రూపంలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి



ఉత్సవానికి హాజరైన అశేష జనంలో ఓ భాగం

- భక్తిశ్రద్ధలతో పోతులరాజు పుష్పాలంకరణ

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.ఆదివారం సాయంత్రం 'పోతులరాజు పుష్పాలంకరణ మహోత్సవం'లో భాగంగా మహాకాళి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా రాజవంశీకుల ఇంటి నుంచి పోతులరాజులు ప్రత్యేకంగా అలంకరించుకుని పురవీధుల గుండా నృత్యం చేస్తూ మంగళవాయిద్యాల నడుమ ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాలబావి సమీపంలో పోతులరాజు పుష్పాలంకరణ మహోత్సవాన్ని అశేష భక్తజనం మధ్య వైభవంగా నిర్వహించారు. మహిళలు దేవాలయ సమీపంలోని పాలబావిలో గంగపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపట్టారు. ఇలా చేయడం వల్ల సంతాన భాగ్యం లేని వారికి సంతాన ప్రాప్తి,దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం. జాతరలో తినుబండారాల అంగళ్లు కిటకిటలాడాయి. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజవంశీకుల కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోతులరాజు పుష్పాలంకరణ మహోత్సవ వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు పాల్గొన్నారు. ఉత్సవాల్లో సోమవారం పాలబావిలో గంగపూజతో పాటు రాత్రికి పోతులరాజు బండారు మహోత్సవం నిర్వహించనున్నట్లు రాజవంశీకుడు దొర రంగప్ప రాజు, గ్రామ పెద్దలు తెలిపారు.

క్లుప్తంగా

తల్లిదండ్రుల చెంతకు బాలిక


బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దృశ్యం

గుంతకల్లు: తప్పిపోయిన ఓ బాలికను గుంతకల్లు రైల్వే పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపిన మేరకు... కర్ణాటకలోని గదగ్‌కు చెందిన ఎనిమిదేళ్ల వయసున్న రోకియ తప్పిపోయింది. దీంతో తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లను అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న గుంతకల్లు జీఆర్పీ సిబ్బంది అప్రమత్తమై శనివారం రాత్రి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న హుబ్లీ వైపు నుంచి వచ్చిన హంపి ఎక్స్‌ప్రెస్ (16591) రైలులోని బోగీలను పరిశీలించారు. ఓ బోగీలో దిగాలుతో కూర్చొని ఉన్న రోకియాను గుర్తించి తమ స్వాధీనంలోకి తీసుకుని సమాచారం ఇవ్వడంతో ఆదివారం ఉదయం గదగ్ పోలీసులు, తల్లిదండ్రులకు గుంతకల్లుకు చేరుకున్నారు. కౌన్సెలింగ్ అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

కండక్టర్‌పై ఖాకీ దౌర్జన్యం


హెడ్ కానిస్టేబుల్

గుత్తి: టికెట్ తీసుకుని ప్రయాణం చేయాలని సూచించిన ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై ఓ హెడ్ కానిస్టేబుల్ బూతులతో రెచ్చిపోయారు. వివరాలు.. ఆదివారం తెల్లవారుజామున గుత్తి ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులతో బయలుదేరిన బస్సు గార్లదిన్నె మండలం కల్లూరుకు చేరుకోగానే ఓ హెడ్ కానిస్టేబుల్ ఎక్కారు. టికెట్ తీసుకోవాలని కండక్టర్ గంగేశ్వర్ అడగడంతో తాను హెడ్ కానిస్టేబుల్‌నని, టికెట్ తీసుకునేది లేదని తెలిపారు. 'అలా కాదు సార్.. వారెంట్ ఏదైనా ఉంటే చెప్పండి ఫ్రీ గా ప్రయాణం చేయవచ్చు. అలా కాదంటే టికెట్ తీసుకోవాల్సిందే' అంటూ కండక్టర్ చెప్పగానే హెడ్ కానిస్టేబుల్ రెచ్చిపోయి బూతులతో విరుచుకు పడారు. 'ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో.. అవసరమైతే కోర్టుకు పోతావా? పో' అంటూ బెదిరింపులకు దిగారు. తాను లేకుండా బస్సు అక్కడి నుంచి ఎలా ముందుకెళుతుందో చూస్తానంటూ భీష్మించారు. దీంతో సహనం కోల్పోయిన కండక్టర్ టికెట్ తీసుకోవాల్సిందేనంటూ గట్టిగా పట్టుబట్టారు. హెడ్ కానిస్టేబుల్ నిర్వాకంతో బస్సు అక్కడే నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ క్రమంలో కొందరు ప్రయాణికులు కల్పించుకోవడంతో చివరకు హెడ్‌కానిస్టేబుల్ టికెట్ తీసుకున్నారు. ఘటనపై పోలీసులతో పాటు ఆర్టీసీ డీఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు కండక్టర్ గంగేశ్వర్ తెలిపారు. కాగా, వివాదాస్పదమైన సదరు హెడ్ కానిస్టేబుల్ పేరు లక్ష్మీనారాయణ అని ప్రయాణికులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ పనిచేస్తున్నది తెలియదన్నారు. పోలీసు శాఖ ప్రతిష్టను దిగజారుస్తున్న ఇలాంటి వారిపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనంత వరకూ ఇలాంటి ఘటనలు తరచూ చూడాల్సి వస్తుందని పేర్కొన్నారు.

పారాహుషార్!

- బదిలీల పాయింట్ల కోసం ఉపాధ్యాయుల అడ్డదారులు
- ఇప్పటికే సదరం సర్టిఫికెట్లు పొందిన ఉమ్మడి జిల్లాలోని పలువురు టీచర్లు
- సర్టిఫికెట్ల పరిశీలనకు 24, 25, 26 తేదీల్లో 'అనంత'లో ప్రత్యేక శిబిరం
- అక్రమార్కుల్లో మొదలైన వణుకు
- తేడా వస్తే కఠిన చర్యలుంటాయన్న విద్యాశాఖ అధికారులు





అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాధాన్యత కేటగిరి కింద జిల్లా కేంద్రానికి సమీప పాఠశాలల్లో చేరాలని కొందరు.. ప్రత్యేక పాయింట్లు పొంది తమకు అనుకూలమైన ప్రాంతాల్లో చేరాలని మరికొందరు టీచర్లు ఎంచుకున్న అక్రమ మార్గాలు.. చివరకు వారి మెడకే చుట్టుకోబోతున్నాయి. గతంలో జరిగిన అనేక బదిలీల్లో ఇలాంటి బాగోతాలు వెలుగుచూశాయి. తాజాగా మరోమారు అక్రమంగా పాయింట్లు పొందేందుకు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో డబ్బుకు ఆశపడిన వైద్యులు కొందరు టీచర్లకు 'ప్రాధాన్యత కేటగిరి' కింద 70–80 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తే... మరి కొందరికి ప్రత్యేక పాయింట్ల కింద ఇబ్బడి ముబ్బడిగా ధ్రువీకరణపత్రాలు జారీ చేశారు. వైకల్యం 40–50 శాతం ఉంటే 5 పాయింట్లు, 51 నుంచి 69 ఉంటే 10 పాయింట్లు వరకు బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుంది. 10 పాయింట్లు అంటే నాలుగేళ్ల సర్వీస్‌కు వచ్చే పాయింట్లతో సమానం. రెండు పాయింట్లకే వందలాది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటున్న ప్రస్తుత పరిస్థితుల్లోనే కొందరు టీచర్లు అడ్డదారులు వెతుక్కున్నారు. ఇందు కోసం రూ.లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

24 నుంచి 'అనంత'లో ప్రత్యేక శిబిరం..

ప్రాధాన్యత కేటగిరి, ప్రత్యేక పాయింట్ల కింద ఈసారి బదిలీలకు అర్హత పొందిన టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలనకు ఈ నెల 24, 25, 26 తేదీల్లో అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ప్పటికే సదరం క్యాంపుల్లో వైద్య ధ్రువీకరణపత్రాలు పొందిన వారూ హాజరు కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారివద్ద ఉన్న మెడికల్ రిపోర్ట్‌లు పరిశీలించిన అనంతరం ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారులు జారీ చేసిన సర్టిఫికెట్లనే బదిలీలకు ప్రామాణికంగా తీసుకోనున్నారు. శారీరక వైకల్యాలతో పాటు క్యాన్సర్, గుండె శస్త్రచికిత్స, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, వెన్నుముక శస్త్ర చికిత్సలు చేయించుకున్న టీచర్లు, మానసిక వైకల్యం ఉన్న పిల్లలు.. భాగస్వామి ఉన్నవారు, జువైనల్ డయాలసిస్, తలసీమియా, హిమోఫీలియా రోగాలతో బాధపడుతున్న పిల్లలు ఉన్నవారు, పుట్టుకతోనే గుండెలో రంధ్రాలతో జన్మించి శస్త్రచికిత్స చేయించుకున్న పిల్లలున్న వారు ఈ ప్రాధాన్యత కేటగిరీ కిందకు వస్తారు. శస్త్ర చికిత్స తేదీ నుంచి మూడేళ్ల వరకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. అయితే కొందరు ఎప్పుడో జరిగిన శస్త్రచికిత్సలకు సంబంధించిన రిపోర్టులను పెట్టి అడ్డదారిలో ఈ కేటగిరీలో చేరుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రిఫరెన్షియల్, స్పెషల్ కేటగిరీలకు సంబంధించిన అంశాలపై పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ప్రత్యేక దృష్టి సారించారు. ఎవరైనా నకిలీ పత్రాలు సమర్పించినట్లు వైద్య శిబిరంలో వైద్యులు గుర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఉపాధ్యాయ కేటగిరీల నుంచి దాదాపు 1,400 మంది వరకు ఉన్నట్లు అంచనా.

ప్రభుత్వంపై అదనపు భారం

నకిలీ సర్టిఫికెట్లను కేవలం బదిలీలకు మాత్రమే ఉపయోగించడం లేదు. ప్రభుత్వం కల్పించే వివిధ రాయితీలను సైతం ఎంచక్కా పొందుతున్నారు. నెలకు రూ. 2 వేలు చొప్పున ఏడాదికి రూ. 24 వేలు, ప్రొఫెసనల్ ట్యాక్స్ ప్రతి నెలా రూ.200 ప్రకారం ఏడాదికి రూ.2,400 చొప్పున ప్రభుత్వం నుంచి వీరు లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. 2 వేలు పీఆర్సీ అమలు చేస్తే ఇది కాస్త రూ.5 వేలు అవుతుంది. ఇలాంటి వారు ఉమ్మడి జిల్లాలో 200 మందికి పైగా ఉన్నట్లు తెలిసింది. వీరి కారణంగా ప్రతినెలా ప్రభుత్వంపై రూ.లక్షల్లో అదనపు భారం పడుతోంది.

నిర్ధారణ అయితే కఠిన చర్యలు



త్వరలో జరిగే టీచర్ల బదిలీలకు సంబంధించి ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లతో లబ్ధి పొందాలనుకునే వారిపై డైరెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. అర్హులు ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్నారు. అలాగని అనర్హులు అడ్డదారుల్లో వస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ మెడికల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. ఆయా ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాత పర్సెంటేజీలో వ్యత్యాసం ఉన్నా, లేని రోగాలు ఉన్నట్లు పెట్టిన సర్టిఫికెట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవు.

– ఎం.ప్రసాద్‌బాబు, విద్యాశాఖ అధికారి

గోవుల సంరక్షణకు సహకరిస్తాం

- గోశాల నిర్వాహకులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన


గోవులకు ఆహారం అందిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: గోవుల సంరక్షణకు అవసరమైతే జిల్లా యంత్రాంగం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ఇస్కాన్ గోశాల ఇన్‌చార్జి దామోదర్ గౌరంగదాస్‌కు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమీపంలోని ఇస్కాన్ గోశాలను ఆదివారం కలెక్టర్ సందర్శించారు. గోవులకు పచ్చగడ్డి, అరటిపండ్లు, బెల్లం తినిపించారు. ఎంత విస్తీర్ణంలో గోశాల ఏర్పాటు చేశారు? ఎన్ని గోవులున్నాయి? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 2.70 ఎకరాల విస్తీర్ణంలో గోశాల ఏర్పాటు చేయగా... ప్రస్తుతం 440 ఆవులు ఉన్నాయని, గడ్డికి ఎలాంటి ఇబ్బంది లేదని గోశాల ఇన్‌చార్జి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నగర రహదారులపై సంచరిస్తున్న పశువులకూ ఆశ్రయం కల్పించాలని సూచించారు. దీంతో గోశాలకు అదనపు భూమి కేటాయిస్తే వాటిని అక్కడ ఉంచి సంరక్షిస్తామని కలెక్టర్‌కు ఇన్‌చార్జి తెలిపారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ భూ కేటాయింపు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. అనంతరం గోశాలలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, ఏడీ రత్నకుమార్, తహసీల్దార్లు పుణ్యవతి, మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత జకీవుల్లా ఆకస్మిక మృతి


జకీవుల్లా (ఫైల్)


మాజీ ఎంపీ కేఎం సైఫుల్లాను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపీ కేఎం సైపుల్లా కుమారుడు జకీవుల్లా (51) ఆదివారం హైదరాబాదులో గుండె పోటుతో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీతో విడదీయరాని అనుబంధాన్ని ఏర్పరుచుకున్న కుటుంబం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నేతలు బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సోమవారం జకీవుల్లా భౌతిక కాయాన్ని అనంతకు తీసుకురానున్నారు. పార్టీ శ్రేణుల సందర్శనార్థం స్వగృహంలో ఉంచనున్నారు. సైపుల్లాకు ఇద్దరు కుమారులు కాగా, మొదటి కుమారుడు రహంతుల్లా ఇదివరకే మరణించాడు. ఇప్పుడు జకీవుల్లా కూడా మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

మంచి నాయకుడు..

జకీవుల్లా ఉన్నత భావాలు ఉన్న ఓ మంచి నాయకుడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం జకీవుల్లా మృతి చెందిన విషయం తెలియగానే ఆయన సైపుల్లా ఇంటికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే పలువురు టీడీపీ నేతలు సైపుల్లా, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ఖాద్రీశుడికి వెండి సామగ్రి వితరణ

కదిరి టౌన్: బెంగళూరులోని రాజాజీనగర్‌లో నివాసముంటున్న ఉమేష్, రూప దంపతులు శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ఒక కిలో వెండి సామగ్రిని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతల పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అర్చకులు అందజేశారు.

సూపర్ మార్ట్‌లో యువతిపై దాడి

అనంతపురం: నగరంలోని శాంతినగర్ వద్ద ఉన్న వియాన్సీ ఫ్యామిలీ మార్ట్‌లో ఓ యువతిపై దాడి జరిగింది. అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపిన మేరకు... అనంతపురంలో నివాసముంటున్న గుంటూరు హరిత తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో తన చిన్నాన్న పర్యవేక్షణలో ఉంటూ ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో అప్పుడప్పుడు తన చిన్నాన్న నిర్వహిస్తున్న వియాన్సీ ఫ్యామిలీ మార్ట్‌లోని నగదు కౌంటర్ వద్ద వ్యాపార లావాదేవీలను చూస్తుంటారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 10:30 గంటలకు స్కార్పియో వాహనంలో మార్ట్‌కు చేరుకున్న సాకే నాగమణి, పయ్యావుల లోకనాథ్, డ్రైవర్ దుర్గాప్రసాద్ ఓ బాస్కెట్ తీసుకుని అందులో తమకు కావాల్సిన సరుకులు వేసుకుని బిల్లింగ్ కౌంటర్ వద్దకు చేరుకున్నారు. వాటికి బిల్ వేయడంతో రూ.200 అయింది. వారి వద్ద ఉన్న క్లాత్ బ్యాగ్‌లో వేసుకున్న వస్తువులు కూడా బయటకు తీయాలని అక్కడున్న అనిల్ తెలిపాడు. తాము ఎలా కనిపిస్తున్నామంటూ వారు దబాయించారు. దీంతో షాపింగ్ చేస్తున్న సమయంలో తాము సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నామని, అందులో వారు కొన్ని వస్తువులు బ్యాగ్‌లో వేసుకోవడం స్పష్టంగా గమనించినట్లు తెలపడంతో సాకే నాగమణి రెచ్చిపోయి హరిత జుట్టు పట్టి లాగి కొట్టారు. అదే సమయంలో హరితపై పయ్యావుల లోకనాథ్, డ్రైవర్ దుర్గాప్రసాద్ దాడి చేయబోతుండగా తప్పించుకుని ఉన్న గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. తలుపులు బద్దలుగొట్టేందుకు లోకనాథ్, దుర్గాప్రసాద్ ప్రయత్నిస్తుండడంతో అక్కడున్న సిబ్బంది అడ్డుకుని సర్దిచెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


వెంకటేష్ నాయక్, శాంతమ్మ మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఉరవకొండ: స్థానిక నియోజకవర్గ పరిధిలో చోటు చేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండాకు చెందిన వెంకటేష్ నాయక్ (51) ఆదివారం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు బయలుదేరాడు. మార్గమధ్యంలో పీసీ ప్యాపిలి వద్దకు చేరుకోగానే బస్సు కోసం వేచి ఉన్న అదే గ్రామానికి చెందిన శాంతమ్మ(33) అభ్యర్థన మేరకు ఆమెను తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని బయలుదేరాడు. ఉరవకొండ సమీపంలోని హంద్రీ–నీవా కాలువ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, వెంకటేష్‌నాయక్ భార్య ఏడాది క్రితమే చెందింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. పీసీ ప్యాపిలికి చెందిన శాంతమ్మ భర్త వన్నూరు స్వామి ఉరవకొండలోని ఓ హోటల్‌లో సప్లయిర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తమ్ముడి నిశ్చితార్థానికి వెళుతూ..

అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ప్రవల్లిక.. ఉరవకొండలో భర్త మల్లికార్జునతో పాటు కలసి నివాసముంటుంది. ఈ క్రమంలో రోజూ బస్సులో విధులకు వెళ్లి వచ్చేవారు. వజ్రకరూరు మండలం చాబాలలో ఉన్న తన తమ్ముడి వివాహ నిశ్చితార్థం ఉండడంతో ఆదివారం భర్తతో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో ప్రవల్లిక అక్కడికక్కడే మృతి చెందింది.


ప్రవల్లిక (ఫైల్)

తీవ్రంగా గాయపడిన మల్లి కార్జునకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఈ రెండు ఘటలపై సీఐ మహనంది కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో చిన్నారి మృతి


మృతి చెందిన జోష్య

కొలిమిగుండ్ల: నంద్యాల జిల్లాలో కారు, బొలెరో పరస్పరం ఢీకొన్న ఘటనలో అనంతపురం జిల్లాకు చెందిన ఓ చిన్నారి మృతి చెందింది. మరో ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి తన కుమార్తె జోష్యహర్షిణిరెడ్డి(6)ని నంద్యాలలోని మేనమామ ఇంట్లో ఉంచి చదివిస్తున్నాడు. ఈ క్రమంలో అమ్మవారికి మొక్కుబడి చెల్లించాల్సి ఉండడంతో తాత, విశ్రాంత ఉపాధ్యాయుడు రామసుబ్బారెడ్డి, బంధువులు వెంకటసుబ్బారెడ్డి, ఏటూరి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీదేవితో కలసి కారులో నంద్యాల స్వగ్రామానికి జోష్యహర్షిణిరెడ్డి బయలుదేరింది. కొలిమిగుండ్ల మండలం రాఘవరాజుపల్లి శివారులోకి చేరుకోగానే అంకిరెడ్డిపల్లి నుంచి కొలిమిగుండ్లకు వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు ఎగిరి రోడ్డు పక్కన బోల్తాపడింది. కారులో ఉన్న వారందరూ అందులో చిక్కుకుపోయారు. బొలెరో వాహనంలో ఉన్న అంకిరెడ్డిపల్లికి చెందిన యువకులు రాజకుళ్లాయి, బాలుకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు కారులో చిక్కుకుపోయిన వారిని అతి కష్టంపై వెలికితీసి, తాడిపత్రిలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న జోష్యహర్షిణిరెడ్డిని మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రుడు ఏటూరి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్షతగాత్రుడి ప్రాణాలు కాపాడిన డీఎస్పీ

రాప్తాడు: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అసహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడిని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు సకాలంలో తన వాహనంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. రాప్తాడుకు చెందిన యువకుడు చెడిపోతుల కుళ్లాయప్ప ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళుతూ జేఎన్‌టీయూ మార్గంలోని భారత్ గ్యాస్ కార్యాలయం ఎదుట డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలతో పడిపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి 108కు సమాచారం అందించారు. అయితే ఎంతకూ 108 వాహనం రాలేదు. ఈ లోపు కుళ్లాయప్ప పరిస్థితి విషమిస్తుండడంతో తన సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశులు అప్రమత్తయ్యారు. అప్పటికే ఇంటికి వాహనంలో బయలుదేరిన ఆయన వెంటనే ప్రమాదస్థలానికి చేరుకుని తీవ్ర గాయాలతో పడి ఉన్న కుళ్లాయప్పను స్థానికుల సాయంతో తానే పైకి లేపి తన వాహనంలో సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో స్థానికంగానే తొలుత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అటు నుంచి బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. కాగా, క్షతగాత్రుడిని తన వాహనంలో ఆస్పత్రికి చేర్చిన డీఎస్పీ చొరవను స్థానికులు అభినందిచారు. 'ఈ సార్ చాలా మంచోడు' అంటూ కితాబునిచ్చారు.

వైభవం.. సల్లాపురమ్మ జ్యోతుల ఉత్సవం


అలంకరణలో సల్లాపురమ్మ దేవత

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో ఆదివారం సల్లాపురమ్మ జ్యోతుల ఉత్సవం వైభవంగా సాగింది. వేలాది కుటుంబాలు ఉన్న గ్రామంలో ప్రతి ఇంటి నుంచి జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వాటిని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను అమ్మవారికి సమర్పించిన అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులు పెద్ద ఎత్తున బియ్యం, బేడలు, ఆకు వక్క తదితరాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద పోతురాజు విన్యాసాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన తినుబండారాలు, ఆట బొమ్మల అంగళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.


జ్యోతులు, బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

మేధస్సును కదిలించేది 'శ్రమ కావ్యం'

- సుద్దాల అశోక తేజ


మాట్లాడుతున్న సుద్దాల అశోక తేజ

అనంతపురం: మేధస్సును కదిలించేది 'శ్రమ కావ్య గానం' అని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక తేజ అన్నారు. ఆయన రచించిన శ్రమ కావ్యం గానం పుస్తక పరిచయ కార్యక్రమం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో సీఐటీయూ, ఐద్వా, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ ప్రవంతి నాయకురాలు డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ... సుద్దాల అశోక్ తేజ సాహితీ ప్రస్థానాన్ని వివరించారు. రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. సుద్దాల అశోక్ తేజ రచనలు శ్రమ శక్తిని చాటేలా ఉంటాయన్నారు. అనంతరం సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. శ్రమ కావ్యం గానం గురించి వివరించారు. శ్రమ అన్నది మేథో శ్రమ, శారీరక శ్రమ రెండు రకాలుగా ఉంటుందన్నారు. ఈ రెండు కలగలిసి ప్రయాణం సాగిస్తుంటాయని వివరించారు. శ్రమ ద్వారానే సామాజిక గమనం ఉంటుందనే అంశాన్ని శ్రమ కావ్యం గానం ద్వారా వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, సీఐటీయూ ఆర్వీ నాయుడు, యూటీఎఫ్ లింగన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, సీఐటీయూ రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాష, సామాజిక వేత్త బోస్, మానవతా రక్తదాత తరిమెల అమర్‌నాథ్ రెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అపూర్వ' సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరులోని కాటవెంకటప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1978–79లో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. దాదాపు 46 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాటి చిలిపి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నాగరాజుశర్మ, దత్తాత్రేయశర్మ, అక్కులప్ప, హనమంతప్ప తదితర ఉపాధ్యాయులకు పాదపూజ చేసి, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

క్లుప్తంగా

'వైద్య విద్యను దూరం చేయొద్దు'



మాట్లాడుతున్న రవి శంకర్

అనంతపురం టవర్‌క్లాక్: కొత్త ఫీజుల విధానంతో రిజర్వేషన్ వర్గాలకు వైద్య విద్యను దూరం చేయవద్దని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో రూ.12 లక్షలకు ఫీజు పెంచారన్నారు. దీనివల్ల రిజర్వేషన్ వర్గాలకు చెందిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రిజర్వేషన్ వర్గాల వారు అంత డబ్బు ఖర్చు పెట్టి చదివి స్తోమత లేదని పేర్కొన్నారు. అందుకే పాత ఫీజులతోనే వైద్య విద్యను అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, డిప్యూటీ తహసీల్దార్ సుగప్ప పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న సినీనటి సుమయ రెడ్డి

అనంతపురం కల్చరల్: ఏ ప్రభుత్వమైన విద్య, వైద్య రంగాలను ప్రోత్సహిస్తే ఎటువంటి కరువు సీమలోనైనా శాంతి కుసుమాలు పూస్తాయని సినీనటి సుమయ రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె 'డియర్ ఉమ' సినిమా ప్రమోషన్ కోసం అనంతకు విచ్చేశారు. స్థానిక గాయత్రి థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. చిన్నతనమంతా అనంతలోనే సాగిందన్నారు. తర్వాత మోడల్‌గా, సినిమాలో నటించడానికి హైదరాబాద్ చేరుకున్నట్లు తెలిపారు. సందేశాత్మకంగా నిర్మించిన సినిమాను ఆదరించాలని కోరారు. కొందరు అత్యుత్సాహంతో సెలబ్రెటీల జీవితాల్లోకి బలవంతంగా దూరి వివాదాస్పదం చేయడానికి చూస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రతి వృత్తికి ఎంతో పవిత్రత ఉంటుందని.. మీడియా వారు కూడా నిజానిజాలను మాత్రమే బయటకు తీసుకువచ్చి అన్ని వర్గాల వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో సినిమా ప్రమోటర్ మిథున్‌రెడ్డి, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

'ప్రాథమిక తరగతుల విలీనం సరికాదు'



ఎమ్మెల్యే ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆప్టా నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల విలీనాన్ని ఆపాలని అనంతపురం జిల్లా ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆప్టా జిల్లా అధ్యక్షుడు సి.గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో 1-10 తరగతులను నిర్వహించాలని ఆలోచించడం అశాస్త్రీయమన్నారు. అదేవిధంగా మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో ఏర్పాటు చేస్తున్న పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్ ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఆప్టా జిల్లా ఆర్థిక కార్యదర్శి బీపీ శంకరమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.నారాయణ, చల్లా శివానంద, కుళ్లాయప్ప, జి.మురళీధర్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు



అలంకరణలో మంజునాథుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆకు పూజ అనంతరం స్వామి వారి స్వర్ణ కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సారూ.. సమస్యలు పట్టించుకోరూ

- నేడు రాప్తాడులో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- హాజరుకానున్న కలెక్టర్ వినోద్ కుమార్
- స్వాగతం పలుకుతున్న సమస్యలు
- వాహనదారులను వేధిస్తున్న రైల్వే వంతెన సమస్య
- జాతీయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం
- సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు





గత ఏడాది అక్టోబర్‌లో భారీ వర్షాలకు నీట మునిగిన జేఎన్‌టీయూ రోడ్డు (ఫైల్), ఆగిపోయిన అండర్ గ్రౌండ్ పనులు (ఫైల్)

రాప్తాడు: మండల కేంద్రంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. కార్యక్రమానికి హాజరుకానున్న కలెక్టర్ వినోద్ కుమార్‌కు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కొంత కాలంగా రైల్వే వంతెన సమస్య ప్రజలను వేధిస్తోంది. వంతెన పనులు ఇంత వరకూ పూర్తి కాలేదు. అలాగే పండమేరు వంక (జేఎన్‌టీయూ రహదారి)పై బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో వర్షాలు వచ్చినప్పుడు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జేఎన్‌టీయూకు వెళ్లే వాహనాదారులు రాప్తాడు బైపాస్ మీదుగా రాంగ్ రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాప్తాడు దగ్గర ఉన్న జాతీయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. బెంగళూరు–హైదరాబాద్ 44వ జాతీయ రహదారి, అనంతపురం–చెన్నై 42 జాతీయ రహదారులను అనుసంధానం చేయడానికి అనంతపురం రూరల్ మండలంలోని సమతగ్రాం (ఆకుతోటపల్లి) నుంచి రాప్తాడు వరకూ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి 44వ జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు పంగల్ రోడ్డు మీదుగా అనంతపురం నగరం, చెన్నై జాతీయ రహదారిలోకి వెళ్లాలంటే రాప్తాడు రైల్వే గేటు తప్పనిసరిగా దాటాల్సి ఉంటుంది. అలాగే చెన్నై నుంచి బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు వెళ్లాలంటే వాహనాలు అనంత నగరంలోకి ప్రవేశించకుండా ఈ బైపాస్ మీదుగా ఈ గేటు దాటుకుని రాకపోకలు సాగించడానికి పనులు చేపట్టారు. గంగలకుంట సమీపాన రైల్వే గేట్ సమస్య పరిష్కారానికి ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు) కూడా అప్పట్లోనే ప్రారంభమయ్యాయి. ఆ ప్రాంతంతో ప్రైవేటు స్థలాలకు సంబంధించి వివాదం తలెత్తి పనులు పనులు ఆగిపోయాయి. అనంతరం స్థల వివాదం పరిష్కారమైనా నిర్మాణాలు ఇప్పటికీ కొలిక్కి రాలేదు. అప్పట్లో తమిళనాడుకు చెందిన కాంట్రాక్టర్ సంస్థ పనులు చేపట్టింది. రాప్తాడు వైపు ఉన్న బ్రిడ్జి పనులు పూర్తి చేసినా.. ఎస్కేయూ వైపు ఆగిపోయాయి. పనుల పర్యవేక్షణలో జాతీయ రహదారుల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అండర్ పాస్ వంతెనపై బీటీ రోడ్లు, సర్వీసు మార్గానికి బీటీ రోడ్డు, వంతెనకు ఒక వైపు వరద నీరు ప్రవహించడానికి కాలువ, కందుకూరు మార్గం వద్ద కొంత మేర తారు రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సమారు 30 శాతం పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

మూతపడిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం

గ్రామ సచివాలయ ఉద్యోగులు రోజూ విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అయితే జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని రాప్తాడు గ్రామ సచివాలయం-1, 2లో ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.లక్షలాది రూపాయలతో జగనన్న కాలనీలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం మూతపడ్డాయి. పండమేరు వంక దాటుకుని సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని రాప్తాడు గ్రామస్తులు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి రాప్తాడులో స్థానిక బస్టాండులో పాత సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం పక్కనే రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆరు నెలలుగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి తలుపులు వేయడంతో అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి సిబ్బందిని ఇక్కడి నుంచి కొత్త భవనాల్లోకి మార్చాలని రాప్తాడు గ్రామస్తులు కోరుతున్నారు.

రైల్వే వంతెన పూర్తి చేయండి



గంగలకుంట రైల్వే వంతెన పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పూర్తి కాలేదు. ఈ రోడ్డు మీదుగా అనంతపురం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఒకే సారి మూడు రైళ్లు వస్తున్నాయి. మూడు ట్రైన్లు వచ్చినప్పుడు వాహనాలు దాదాపుగా ఒక అర్ధ కిలోమీటర్ మేరకు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి రైల్వే గేటు సమీపంలోనే వాహనాలు ఇరుక్కుని పోతున్నాయి. ఇలాంటి సమయంలో అంబులెన్స్‌లు వస్తే రోగుల అవస్థలు చెప్పలేనివి. ఇప్పటికే రైల్వే వంతెన గురించి మండల స్థాయి, జిల్లా స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు.

– పసుపుల హేమావతి, జెడ్పీటీసీ సభ్యురాలు, రాప్తాడు

బ్రిడ్జి నిర్మించాలి



పండమేరు వంకపై బ్రిడ్జి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నేను రాప్తాడులో సెల్ మెకానిక్ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. సెల్‌ఫోన్లకు కావాల్సిన పరికరాలు కావాలంటే అనంతపురం వెళ్లాల్సి వస్తోంది. అనంతపురం వెళ్లాలంటే పండమేరు వంక మీదుగా చిన్మయనగర్, జేఎన్‌టీయూ మీదుగా వెళ్లాలి. గత ఏడాది అక్టోబర్‌లో పండమేరు వంక ఉధృతంగా ప్రవహించింది. నెల రోజుల పాటు ఈ వంక మీదుగా రాకపోకలు ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి ఏర్పాటు చేయాలి.

– రామాంజిన రెడ్డి, సెల్ షాపు నిర్వాహకుడు, రాప్తాడు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతను సన్మానించిన కిరణ్ కుమార్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అనుబంధ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బండి కిరణ్‌కుమార్ ఆదివారం అనంతను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనకు మంచి హోదాను కల్పించిందన్నారు. అందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం వెన్నపూస రవీంద్ర రెడ్డిని ఆయన నివాసంలో కిరణ్‌కుమార్ కలిశారు. నాయకులు సతీష్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల నైపుణ్యం అభినందనీయం

అనంతపురం కల్చరల్: ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా లలిత కళాపరిషత్తు కృషి చేస్తోందని ఎల్కేపీ అధ్యక్ష, కార్యదర్శులు గురుప్రసాద్, గాజుల పద్మజ అన్నారు. ప్రపంచ నాటకరంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి వీరేశలింగం పంతులు అవార్డులు దక్కించుకున్న అనంత కళాకారులను ఆదివారం ఎల్కేపీలో సన్మానించారు. సంగాల నారాయణ స్వామి, సోమర లక్ష్మీనారాయణ, జేకే రామాంజనేయులు, ఆదినారాయణరెడ్డి, సురభి ఆనంద్, వాల్మీకి కుళ్లాయప్ప, శివశంకర్, వరప్రసాద్, ఎర్రిస్వామి, రామగోపాల్, ఎస్.నారాయణ స్వామి, రాజకుళ్లాయప్ప, నరహరి తదితరులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా 13 మంది జిల్లా కళాకారులు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా కళాకారులు ప్రదర్శించిన పౌరాణిక నాటకాలు ఆకట్టుకున్నాయి. లలిత కళాపరిషత్తు నటీనటులు సోమిరెడ్డి, మలోబులు, మల్లికార్జున, ఇంద్రజ, శ్రీనివాసమూర్తి, రత్నమోహన్, ఐజయ్య తదితరులు పాన్పు సీను, భక్తచింతామణి, రామాంజనేయ యుద్ధం, సత్యహరిచంద్ర అడవిసీను, వారణాశిసీను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎల్కేపీ ఉపాధ్యక్షుడు రామగోవింద సాగర్, అస్లాం బాషా, శ్రీనివాసులు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభకరం.. ఏసు పునరుత్థానం

- ఘనంగా ఈస్టర్ వేడుకలు



హెర్మోన్ చర్చిలో ప్రార్థనలు



బైబిల్ చదువుతున్న మహిళ



హెర్మోన్ చర్చిలో ప్రసంగిస్తున్న ఐజయ్య

అనంతపురం కల్చరల్: శిలువ వేసి సమాధి చేయబడిన ఏసుక్రీస్తు మూడవ రోజు ఆదివారం పునరుత్థానుడై శాంతి సందేశం అందించిన ఈస్టర్ వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. నలభై రోజుల ఉపవాస దీక్షలకు స్వస్తి పలుకుతూ ఆదివారం క్రైస్తవులు సజీవుడైన క్రీస్తు వాక్యం, దివ్యప్రసాద స్వీకారంతో ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ఉదయం నుంచే నగరంలోని ప్రధాన ప్రార్థనా మందిరాలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి. సప్తగిరి సర్కిల్‌లోని ఎస్‌ఐయూ చర్చిలో రెవరెండ్ సంపత్ విజయ్‌కుమార్, అరవింద నగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చిలో పాస్టర్ మోజెస్ అనిల్‌కుమార్, సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ బెన్‌హర్ బాబు, కోర్టు రోడ్డులోని గాస్పెల్ హాల్‌లో వరప్రసాదరెడ్డి తదితరులు క్రీస్తు జీవిత విశేషాలను తెలియజేశారు. రామచంద్రానగర్‌లోని కార్మియల్ మాత మందిరం, హెర్మోన్ చర్చి, రేమా చర్చి, క్రీస్తు విశ్వాసుల సంఘం తదితర చోట్ల సందడి నెలకొంది. వేలాదిమంది క్రైస్తవులు సామూహిక ప్రార్థనలలో పాల్గొని బైబిల్ పఠనం చేశారు. ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆధ్యాత్మిక భక్తిగీతాలను మధురంగా ఆలపించారు. ఆర్కెస్ట్రా సంగీత హోరులో ఏసును కీర్తిస్తూ పాడిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవుడి మహిమను స్పష్ట పరచడానికి, మానవులను పరిశుద్ధాత్ములుగా మార్చడానికే ఏసు సజీవుడై లేచినట్లు పలువురు పాస్టర్లు తెలిపారు.



భక్తులకు ద్రాక్ష రసం అందజేస్తున్న పాస్టర్లు



సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

జకీవుల్లా మృతికి సంతాపం

అనంతపురం అర్బన్: మాజీ రాజ్యసభ సభ్యుడు కేఎం సైపుల్లా కుమారుడు, టీడీపీ నాయకుడు కె.ఎం.జకీవుల్లా మృతికి సీపీఎం తరపున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఆకస్మిక మృతి తమను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. గతంలో కేఎం రహంతుల్లా, ప్రస్తుతం జకీవుల్లా మృతి చెందడం సైపుల్లాను తీవ్రంగా బాధించే విషయమన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: గుత్తి రోడ్డులో ఉన్న మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో ఆదివారం జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. వారి నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ డిపో, బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే సురక్షితంగా బయటపడటంతో పాటు ప్రయాణికులను ఎలా కాపాడాలనే విషయాలపై అగ్నిమాపక శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలోని పెట్రోల్ పంప్ వద్ద అగ్ని ప్రమాదం జరిగితే ఆ మంటలను అదుపు చేసే విధానాలపై గ్యారేజీ సిబ్బందికి మాక్‌డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపారు. అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి అశ్వర్థ, డిపో అధికారులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ ప్రజా సంఘం నాయకుడు మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దాసగాని కుళ్లాయప్ప, జాకీర్, జాకీర్ హుసేన్, మాధవ, జైభీమ్ రామాంజనేయులు, మూర్తి, సురేంద్ర, అజిత్, ఆదెన్న, హరి ప్రసాద్, గఫూర్, నూర్జహాన్, నజీర్, అత్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రీసాయి మాస్టర్‌మైండ్స్' వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీసాయి మాస్టర్‌మైండ్స్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పీవీ ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో చదువు ఒక్కటే సరిపోదని.. కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విలువలతో కూడిన విద్యనందించాలని కోరారు. డాక్టర్ పి.బసవయ్య, ప్రిన్సిపాల్ కె.మల్లికార్జున మాట్లాడుతూ.. విద్యార్థులు సేవాభావం అలవరుచుకోవాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా వివిధ పాటలకు విద్యార్థులు అదిరిపోయే డ్యాన్సులు చేశారు.

పేదలకు దుస్తుల వితరణ

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన శ్రీకాంత్, సుప్రియ దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దాదాపు రూ.2 లక్షలు వెచ్చించి నిరుపేదలకు దుస్తులు వితరణ చేశారు. అలాగే సాయి ట్రస్టు సహకారంతో నగరంలోని వివిధ ప్రదేశాల్లో 500 మందికి పిండి వంటలతో భోజనం పెట్టారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పెళ్లిళ్లు, ఇతర శుభదినాల సందర్భంగా ఆర్భాటాలు, హంగులకు పోకుండా పేదలకు సాయం చేయాలని సూచించారు.

వైశ్య హాస్టల్ ట్రస్టు అధ్యక్షుడిగా రమేష్‌బాబు



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని రాజు రోడ్డులో ఉన్న రాయలసీమ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్టు అధ్యక్షుడిగా పాలమడ రమేష్‌బాబు ఎన్నికయ్యారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు పోటీపడగా చివరకు హాస్టల్ అధ్యక్షుడిగా మేడా రామనాథ్, ట్రస్టు అధ్యక్షుడిగా రమేష్ బాబును సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మచ్చా నరసింహులు, గౌరవాధ్యక్షుడు నాగరాజు, పాతూరు సంఘం అధ్యక్షుడు పిన్ను నాగరత్నం, ఆదిశేషయ్య, జనార్ధనగుప్తా తదితరులు వ్యవహరించారు. వైశ్య విద్యార్థులకు అండగా నిలిచేందుకు హాస్టల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైశ్య ప్రముఖులు శబరి వరప్రసాద్, కలవల రామకుమార్, పోతుల మనోజ్‌కుమార్, కోటా సత్యనారాయణ, ముడియం రమణ, వెంకట కృష్ణ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీరేదెన్నడు?

- పంపనూరులో తాగునీటి ఎద్దడి
- ఇటీవల బోరు వేయించడంతో సమృద్ధిగా పడిన నీరు
- మోటార్ బిగించేందుకు అనుమతి ఇవ్వని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఇటీవల బోరు వేయడంతో సమృద్ధిగా పడిన నీరు

ఆత్మకూరు: వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే మా దృష్టికి తీసుకురండి. నీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు సమావేశాలు నిర్వహించి మరీ చెబుతారు. తీరా క్షేత్రస్థాయిలో నీటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. మండలంలో పంపనూరు పంచాయతీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. వేసవిలో ప్రజలు నీటి సమస్యతో అల్లాడిపోతున్నారు. నీటి సమస్య ఉందని అధికారులకు కూడా తెలియజేయడంతో సర్పంచ్, పంచాయితీ అధికారులు నాలుగు రోజుల క్రితం గ్రామంలో కొత్తగా బోర్ వేయించారు. బోరులో సమృద్ధిగా నీరు కూడా పడ్డాయి. నీటి సమస్యకు తీరుతుందిలే అని అనుకుంటున్న తరుణంలో మళ్లీ కొత్త సమస్య పుట్టుకొచ్చింది. కొత్తగా వేసిన బోరుకు సంబంధిత అధికారులు తీర్మానాలు ఇవ్వలేదని సమాచారం. గ్రామంలో ప్రస్తుతం రెండు పంచాయతీ బోర్లు ఉన్నాయి. అయితే ఆ బోర్లలో వచ్చే నీరు ప్రజలకు సరిపోవడం లేదు. దాదాపు వెయ్యి మంది జనాభా కలిగిన గ్రామంలో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తీర్మానాలు ఎందుకు ఇవ్వలేదు ?

గ్రామంలో నీటి సమస్య తలెత్తడంతో పంచాయితీ ఆధ్వర్యంలో బోరు కూడా వేయించారు. అయితే కొత్త బోరుకు మోటారు బిగించేందుకు అధికారులు తీర్మానాలు ఎందుకు ఇవ్వలేదని ప్రజలు మండిపడుతున్నారు. బోరు వేసి నాలుగు రోజులు అయినా కనీసం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సర్పంచ్ ఎర్రిస్వామిని సంప్రదించగా.. గ్రామంలో నీటి సమస్య ఉండటంతో కొత్తగా బోరు వేయించామని సమాధానం ఇచ్చారు. మోటారు బిగించాలని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించారు. త్వరలోనే నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.